క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి గ్రామోత్సవం సోమవారం తెల్లవారు జామున వైభవంగా నిర్వహించారు. ఆడికృత్తిక వేడుకల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు పలు రకాల పుష్పాలతో అలంకరించి నెమలి వాహనంపై ఊరేగించారు. బాణసంచా, మంగళవాయిద్యాలతో గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. తమ ఇళ్లముందు రంగవల్లులు తీర్చిదిద్ది స్వామి వారికి స్వాగతం పలికారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



కూరగాయలను విక్రయిస్తున్న సిబ్బంది

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఎంఈఓ శైలజ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సోమవారం ప్రదర్శించారు. పురుగు మందులు వాడకుండా సహజసిద్ధంగా ప్రకృతిలో లభించే ఆవు మూత్రం, కషాయాలతో కూడిన పదార్థాలను ఉపయోగించి పండించిన పంటలు ప్రజలకు ఆరోగ్యకరంగా ఉన్నాయని చెప్పారు. గోంగూర, బెండ, వంకాయ, మునగ, నిమ్మ, ఆకుకూరలు తదితర వాటిని ప్రజలకు విక్రయించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ మోడల్ మేకర్ వీరరాఘవయ్య, ఓజిలి ఇన్‌చార్జీ జైతున్‌బీ, సిబ్బంది చెంచమ్మ, రాజేష్, గురవయ్య, యామినీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కోట: డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు ధ్వజమెత్తారు. కోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. యూనియన్ నాయకురాలు పద్మలీల మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఫేస్‌యాప్ రద్దు చేయాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయమ్మ, కోటేశ్వరి పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న మత్స్యకారులు

చిల్లకూరు : తీర ప్రాంతంలో ఉండే మత్స్యకారులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని దుగ్గరాజపట్నం మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మండల తీర ప్రాంతంలోని గమ్మళ్లదిబ్బ పంచాయతీ కొత్తూరు గ్రామంలో సోమవారం అదానీ కృష్ణపట్నం పోర్టు వారి సౌజన్యంతో దుగ్గరాజపట్నం మెరైన్ స్టేషన్ ఆధ్వర్యంలో మత్స్యకారులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పోర్టు ప్రతినిధులు ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో అదానీ క్రిష్ణపట్నం హెడ్ రాజేష్‌రంజన్, మెరైన్ ఎస్ఐ అంజిరెడ్డి, మత్స్యకార కాపులు వెంకటేశ్వర్లు, పోలయ్య, చిన కాపు పోలయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

కలువాయి(సైదాపురం): మండల కేంద్రంలోని బీఏఎస్ ఆర్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏఎల్ఐఎంసీఓ (ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సమగ్ర శిక్షణ వారి ఆధ్వర్యంలో ఉపకరణాలను ఎంఈఓ శేషగిరిరావు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్బాస్ అలీ, ఉపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి, బి శ్రీనివాసులు, సీఆర్ఎంటీ మహేష్, ఐఈఆర్‌టీలు భానుప్రియ, విశ్వ తదితరులున్నారు



ఉపకరణాలు అందజేస్తున్న దృశ్యం

నిర్మాణం.. అసంపూర్ణం

వేణుంబాకంలో అసంపూర్తిగా ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు



వేణుంబాకంలో పిచ్చిమొక్కలతో నిండిపోయిన సచివాలయ భవన నిర్మాణం



కొత్తపల్లిలో పిల్లర్లు కూడా పూర్తవని విలేజ్ హెల్త్ క్లినిక్



దొరవారి సత్రం మండలంలోని 11 గ్రామ సచివాలయాలకు గాను మూడు గ్రామాల్లో మాత్రమే సచివాలయ భవనం, విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్బీకే భవనాలను పూర్తి స్థాయిలో నిర్మించి ఆయా భవనాల ద్వారానే ప్రజలు, రైతులు, రోగులకు సేవలందుతున్నాయి. తనియాలి, పూలతోట గ్రామ సచివాలయాల్లో మాత్రం కేవలం గ్రామ సచివాలయ భవనాలు పూర్తి చేసి ప్రారంభించారు. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో అన్ని భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే వేణుంబాకం, మీజూరు, తల్లంపాడు తదితర గ్రామాల్లో చేపట్టిన సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు మొండిగోడలకే పరిమితమయ్యాయి. నిరుపయోగంగా మారడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఏకొల్లు, కొత్తపల్లి, తల్లంపాడు ప్రాంతాల్లోని గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు పిల్లర్లు దాటలేదు. ఇలా ప్రజాధనం శిథిలమవుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం గమనార్హం.

- దొరవారిసత్రం

అటవీ భూముల్లో తవ్వకాలపై హెచ్చరిక



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన తహసీల్దార్

చిట్టమూరు : మండల పరిధిలోని యాకసిరి పంచాయతీ రెవెన్యూ పరిధిలోని 425 సర్వే నంబర్ అటవీ భూముల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కాయల సతీష్ కుమార్ తెలిపారు. యాకసిరి అటవీ ప్రాంతంలో సోమవారం తహసీల్దార్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు యాకసిరి పంచాయతీ పరిధిలోని అటవీ భూముల్లో తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, రీసర్వే డీటీ నిరంజన్, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కమనీయం.. వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాకాడు: మండలంలోని వెంకటరెడ్డిపాళెంలో సోమవారం శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బాలిరెడ్డిపాళెం శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధు కిరణ్‌రెడ్డి కుటుంబ సభ్యుల దాతృత్వంతో కల్యాణ మహోత్సవం సాగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అర్చక మండలి సభ్యులు దీవి అనంతాచార్యులు, అరసి నరేష్ శర్మ, ఆలయ నిర్వాహకులు చిన్నియ్య, బోధ గురువులు సాక్షానందస్వామి, సులభాదేవి, అమలాంబ సమేత శ్రీ పరిపూర్ణానంద స్వామి, గురుబోధానందస్వామి, సత్యానంద స్వామి, దయానంద స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిట్టమూరు : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం తిరుపతి స్విమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా సాగుతోందని వైద్యులు తెలిపారు. బీపీ, షుగర్‌తో పాటు బస్సులో పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పురుషులు, మహిళలు ఎక్కువగా పాల్గొని పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యులు తెలిపారు. చిట్టమూరు పీహెచ్‌సీ వైద్యులు పద్మావతి, సుభేంద్ర, స్విమ్స్ మెడికల్ అధికారులు చైతన్యభాను, హెల్త్ సూపర్‌వైజర్ హైమావతి, సీహెచ్‌ఓ బాబురావు పాల్గొన్నారు.

వేడుకగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు



త్యాగరాజ స్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని నాయీ బ్రాహ్మణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సద్గురు సంగీత త్యాగరాజ స్వామి వార్ల 63వ ఆరాధనోత్సవాలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా త్యాగరాజ స్వామి వార్ల చిత్రపటంతో పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో రాత్రి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన నాదస్వర, డోలు విద్వాంసులు శాక్సో ఫోన్ కళాకారులతో పోటాపోటీగా కచ్చేరి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయీబ్రాహ్మణ కళాకారుల సంఘం నాయకులు, త్యాగరాజ స్వామి సేవా సంఘం వారు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన సుమతి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని రాజగోపాలపురం వీధిలో నివాసం ఉంటున్న మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు కథనం మేరకు వెంకటచలం మండలం గొలగమూడి గ్రామానికి చెందిన డబ్బుగుంట సుమతి(30)కి బాలాయపల్లి మండలం కాట్రగుంట గ్రామానికి చెందిన మస్తానయ్యకి మూడేళ్ల కిందట వివాహం చేశారు. సుమతి మేనకూరు సెజ్‌లో పనిచేస్తూ నాయుడుపేటలో నివాసం ఉంటున్నారు. ఆమె భర్త పనిమీద రెండు రోజుల కిందట కేరళకు వెళ్లారు. అక్కడి నుంచి ఆదివారం భార్యకు ఫోన్ చేయగా, ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మనస్థాపం చెందిన సుమతి ఆదివారం సాయంత్రం ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని స్థానికులు రాత్రి గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలి సోదరుడు ప్రసాద్ జరిగిన సంఘటనపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ బాబీ మృతురాలి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సుమతి మృతదేహానికి పోస్టుమార్టం జరిపి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పరిహారం ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యం



రైతుల సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్

చిల్లకూరు: క్రిస్ సిటీ కోసం సేకరించిన భూములకు పరిహారం ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని నడవలవారిపాళెం, పల్లెవానిదిబ్బ, మన్నెగుంట, గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గూడూరు సబ్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా తమ ఇబ్బందులను ఆయన ఎదుట ఏకరువు పెట్టారు. చిల్లకూరు మండలం ముత్యాలపాడు చెరువు ఆయకట్టుదారులు వినతి పత్రం అందించిన అనంతరం మాట్లాడుతూ చెరువు ఆయకట్టు బఫర్ జోన్‌లో ఉన్న భూమిని కొంత మంది రాజకీయ పలుకుబడితో ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి దుర్మరణం



సాని కుమార్ (ఫైల్)

నాయుడుపేటటౌన్: పొట్ట కూటి కోసం కార్పెంటర్ పనుల కోసం రైలులో వెళుతున్న ఓ యువకుడు జారి పడి దుర్మరణం పాలైన సంఘటన మండల పరిధిలో బిరదవాడ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సూళ్లూరుపేట రైల్వే పోలీసుల కథనం మేరకు, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సాని కుమార్(19) మరో ఇద్దరు యువకులతో కలిసి కార్పెంటర్ పనులు చేసుకునేందుకు లక్నో- యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరుకు బయలు దేరారు. డోర్ వద్ద నిలబడి చూస్తున్న సాని కుమార్ కాలు జారి కిందపడి పోయాడు. అయితే అతని స్నేహితులు సానికుమార్ కోసం గాలిస్తూ చెన్నైలో రైలు దిగి రైల్వే పోలీసులకు కలిశారు. వారి విచారణ చేపట్టగా బిరదవాడ సమీపంలో రైలు పట్టాల పక్కన సాని కుమార్ మృతదేహం పడి ఉన్నట్లు సూళ్లూరుపేట రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు సోమవారం తరలించి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

జగనన్నది నవరత్నాల పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేపట్టిన ఏడాదిలో నవరత్న పథకాలను 90 శాతం పూర్తి చేసి చూపించారని నేడు అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం హామీలను ఎగ్గొట్టి ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు చేపడుతున్న బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని గూడూరు సనత్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం చిల్లకూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలియజేసేందుకే బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ అనే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గూడూరు నియోజకవర్గంలో ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి రౌడీలతో పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఇకపై ప్రతి సోమవారం గూడూరు, చిల్లకూరు, గూడూరు రూరల్ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మెట్టా రాధా కృష్ణారెడ్డి, చిల్లకూరు, గూడూరురూరల్ మండల పార్టీ కన్వీనర్లు యద్దల మధుసూదన్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, చిల్లకూరు వైస్ ఎంపీపీ పోలుబోయిన చెంగయ్య, మాజీ ఎంపీపీ దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, మేధావుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షులు నందవరం సుబ్బారావు, సీనియర్ నాయకులు ఓడూరు బాలకృష్ణారెడ్డి, రాజనేని పిచ్చయ్య నాయుడు, ఎల్లసిరి జానకిరామ్, నాగిశెట్టి శారదమ్మ, జక్కంరెడ్డి జనార్దనరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఇస్మాయిల్, కట్టా రవీంద్రెడ్డి, కొట్టు అశోక్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి

బాలాయపల్లి (సైదాపురం): ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని డిప్యూటీ ఎంపీడీఓ కె కృష్ణ అన్నారు. మండలంలోని భైరవరం, పెరిమిడి గ్రామ పంచాయతీల్లో సోమవారం గ్రామ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి అండగా ప్రజలు సహకరిస్తే మరింత అభివృద్ధి సాధించుకోవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాపూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రతిపాదనలో కంప్యూటర్ బోధించేందుకు లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ, ఎంఎస్‌సీ కంప్యూటర్ చేసిన వారు ఈ నెల 25వ తేదీ 11 గంటలకు స్థానిక డిగ్రీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

యాప్‌లతో ఇబ్బందులు

చిల్లకూరు : ఐసీడీఎస్‌లో పని చేసే అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన ఫోన యాప్‌లతో వేగలేకున్నామని గూడూరులోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులతో కలసి అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లలో యాప్‌లు సక్రమంగా పని చేయడం లేదని దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే యాప్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల రూరల్ అధ్యక్షురాలు ఇంద్రావతి, సెక్టార్ లీడర్లు ఎస్‌కే ఆసియా బేగం, జే లక్ష్మి, పి.భారతమ్మ, పెంచలమ్మ, ప్రభావతి, అలేఖ్య, రోజాతో పాటుగా సీఐటీయూ నాయకులు జోగి శివకుమార్, అడపాల ప్రసాద్, బీవీ రమణయ్య, ఎంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

చిట్టమూరు: మండల పరిధిలోని ఎస్ఎస్ఎస్ నగర్ మోడల్ ప్రైమరీ స్కూల్లో ఎంఈవో బీవీ కృష్ణయ్య సోమవారం విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు సంపత్ బాబు ఆర్థిక సాయంతో పాఠశాలలోని 68 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. కార్యక్రమంలో గునపాడు క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు భూపయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఫజుల్లా, విద్యాకమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యల వెల్లువ

నాయుడుపేటటౌన్ : కూటమి హయాంలో పేరుకుపోయిన సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేముందు ఏకరువు పెట్టారు. సుపరిపాలనలో తొలిఅడుగు పేరిట సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గ్రామాల్లో పర్యటించారు. మండల పరిధిలోని వేముగుంట పాళెం, మడపలం, అన్నమేడు, మర్లపల్లి, కాపులూరు, కూచివాడ, చిలమాత్తూరు తదితర గ్రామాల్లో సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆమె వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వెంకటరెడ్డిపల్లి వద్ద కొండ చిలువ



కలువాయి(సైదాపురం): మండలంలోని వెంకటరెడ్డిపల్లిలోని ప్రధాన రహదారి వద్ద అడవిలోంచి ఒక కొండ చిలువ రోడ్డుపైకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొండచిలువను చూసిన కొందరు వాహనచోదకులు రాళ్లతో దాడి చేసి, చంపేశారు. రెండు రోజుల నుంచి ఇదే ప్రాంతంలో తరచు కొండచిలువలు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు.

అదుపు తప్పి కాలువలో పడిన బైక్



కలువాయి(సైదాపురం): మండలంలోని రాజుపాళెం శ్రీపరమానంద ఆశ్రమం వద్ద సోమవారం అనంతసాగరం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి కాలువలో పడిపోయారు. అదృష్టవశాత్తు చిన్న చిన్న గాయాలతో బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులు



దొరవారిసత్రం : రాష్ట్రంలో ప్రజాదరణ కలిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం నేరుగా ఎదుర్కోకలేకనే ఆయన సన్నిహితంగా ఉన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం పిరికి చర్యగా ఉందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరు రాహుల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి అక్రమ కేసులతో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని చెప్పారు. పల్లెల్లో కుప్పలు కుప్పలుగా మద్యం బెల్టు దుకాణాలు వెలిశాయని, దీన్ని పక్కదోవ పట్టించేందుకు కూటమి పెద్దలు అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు.

పోరాడుతూనే ఉంటాం



చిట్టమూరు: కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎవరు ప్రశ్నించినా అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేస్తోందని వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు వాకాటి అశ్విన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం చిట్టమూరులో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా జైలుకు పంపిందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారన్నారు.

మిథున్ రెడ్డి అరెస్టు అక్రమం



నాయుడుపేటటౌన్ : ఎంపీ, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్ రెడ్డి ఖండించారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ నేతలు మద్యం కుంభకోణాన్ని సృష్టించి అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. గతంలోనూ మిథున్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టినా, కడిగిన ముత్యంలా తిరిగి వచ్చారన్నారు.

శ్రీనివాసన్ సేవలు అమోఘం



బ్రిడ్జిని ప్రారంభిస్తున్న కలెక్టర్

వెంకటగిరి (సైదాపురం): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి శ్రీనివాసన్ సేవా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ కొనియాడారు. వెంకటగిరి మండలం మొగులుగుంట ఎస్టీ కాలనీలో శ్రీనివాసన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.48 లక్షలతో నిర్మించిన కనెక్టివిటీ బ్రిడ్జిని సోమవారం స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాస సేవా సంస్థ చైర్మన్ స్వర్ణ సింగ్, వెంకటగిరి క్లస్టర్ ఇన్‌చార్జ్ జైసింగ్, తహసీల్దార్ నరసింహారావు తదితరులున్నారు.

కండలేరులో 28.56 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటి కి 28.560 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,400, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కులనీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పంబలేరు బ్రిడ్జి పరిశీలన

చిల్లకూరు : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి జనార్ధనరెడ్డి గూడూరు పర్యటనలో భాగంగా సోమవారం పంబలేరు బ్రిడ్జిని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిని పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. రెండు పట్టణాలను కలిపే ఆర్ఓ బ్రిడ్జిని కూడా త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపడతామని అన్నారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఆర్అండ్‌బి అధికారులు ఉన్నారు.



నాయుడుపేటలో ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని పెద్ద దర్గా సమీపంలో దుకాణం ముందు నిలిపి ఉన్న ఎలక్ట్రిక్ బైక్ దగ్ధమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన వెంకటేష్ తన ఎలక్ట్రిక్ బైక్‌ను ఎంఆర్ టైలర్ షాపు వీధిలో పార్క్ చేశారు. హఠాత్తుగా బైక్‌లో మంటలు వచ్చి దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే బైక్ పూర్తిగా కాలిపోయింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని కుదిరి వద్ద రోడ్డు ప్రమాదంలో తెనాలికి చెందిన వంశీ(24) అనే యువకుడు మృతి చెందిన విషయం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ బ్రహ్మనాయుడు కథనం మేరకు.. తెనాలి సమీపంలోని కొల్లూరు ప్రాంతానికి చెందిన వంశీ(24) అనే యువకుడు శ్రీ సిటీలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. తోటి ఉద్యోగులతో కలిసి పులికాట్‌ను సందర్శించి ఆదివారం రాత్రి సూళ్లూరుపేటకు స్కూటీపై తిరిగి వస్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్షలు కోసం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.